క్లుప్తంగా

వైభవంగా వేంకటేశ్వర కల్యాణం



భట్టిప్రోలు: భట్టిప్రోలు వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో గురువారం అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వార్ల 24వ వార్షిక కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానాలు - తిరుపతి దాస సాహిత్య ప్రాజెక్టువారి పద్మావతి శ్రీనివాస భజన మండలి ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణ మహోత్సవంలో తూనుగుంట్ల రామకృష్ణ - ఇందిరా కుమారి, బూర్లె వెంకట సుబ్రహ్మణ్యం - ధనలక్ష్మి, మాలేపాటి వెంకట సాయినాథ్ - వీర వెంకటలక్ష్మి గాయత్రిదేవి దంపతులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలను వేద బ్రాహ్మణులు దీవి నాగేశాచార్యులు శాస్త్రయుక్తంగా నిర్వహించారు. స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాన్ని భక్తులు అధిక సంఖ్యలో వీక్షించారు. కార్యక్రమాన్ని ఆర్గనైజర్స్ తూనుగుంట్ల చాముండేశ్వరి, కోట సంధ్యారాణి, బూర్లె అరుణ కుమారి భజన మండలి సభ్యులు పర్యవేక్షించారు.

మార్మోగిన అయ్యప్ప శరణు ఘోష



దుండివారిపాలెం(కర్లపాలెం): అయ్యప్పస్వామి శరణుఘోషతో దుండివారిపాలెం మార్మోగింది. గ్రామంలో అయ్యప్పమాల ధరించిన స్వాములు గ్రామపెద్దలు, దాతల సహకారంతో స్థానిక రామాలయం వద్ద అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక రామాలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పంచ మండపాలలో శివపార్వతులు, విఘ్నేశ్వరుడు, అయ్యప్పస్వామి, సుబ్రమణ్యేశ్వరస్వామి, కనకదుర్గమ్మ, అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి పూలమాలలతో అలంకరించి గురుస్వాముల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. 18 మెట్లకు పడి పూజలు నిర్వహించి హారతి కర్పూర నీరాజనం సమర్పించారు. ఈసందర్భంగా అయ్యప్పస్వాములు ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి. మాలధారణ స్వాములకు, భక్తులకు భిక్ష పంపిణీ చేశారు.

చోడాయపాలెం ఎస్ఐగా రజాక్ బాధ్యతలు స్వీకరణ



రేపల్లె రూరల్: చోడాయపాలెం ఎస్ఐగా అబ్దుల్ రజాక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు వీఆర్ నుంచి సాధారణ బదిలీపై చోడాయపాలెంకు విచ్చేశారు. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న శివప్రసాద్ గుంటూరు వీఆర్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా రజాక్ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రత పరిరక్షణకు కృషి చేయటం జరుగుతుందన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ తమ స్టేషన్ పరిధిలోని ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



మేడికొండూరు: మండలంలోని సిరిపురం గ్రామంలో రైతు సాధికార సంస్థ సెర్ప్ యాజమాన్యం ఒప్పందంలో భాగంగా ప్రకృతి వ్యవసాయ పంటలపై మహిళ రైతులకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఏపీఎం విజయభారతి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వలన సాగు చేసిన పంటల ద్వారా మంచి ఆరోగ్యం వస్తుందన్నారు. సభ్యులు అంతర పంటల సాగుపై రైతులకు ఆర్థికాభివృద్ధి చేకూరుతోందన్నారు. కార్యక్రమంలో టీసీలు షేక్ కరీముల్లా, వి.మల్లేశ్వరరావు, కరుణమ్మ, ఎంఎస్‌టబీలు, వీఓఏలు, వరప్రసాద్ యూనిట్ ఇన్‌చార్జి లక్ష్మి పాల్గొన్నారు.

రసవత్తరంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు

రేపల్లె రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు రేపల్లె పట్టణం, మండలంలో రసవత్తరంగా జరుగుతున్నాయి. మూడోరోజు గురువారం పోటీలను పట్టణంలో మున్సిపల్ కమిషనర్ విజయసారథి, మండలంలో ఎంపీడీఓ శివపార్వతిలతో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు. ఆయా సచివాలయాల ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. యువకులు, గృహిణిలు, విద్యార్థులు పోటీపడి ఆటల పోటీలలో పాల్గొని తమ ప్రతిభను కనపరిచారు. పేటేరులో ఎంపీడీఓ శివపార్వతి, ఈఓపీఆర్డీ మల్లికార్జునరావు, సర్పంచ్ వసుమతిలు పోటీలు ప్రారంభించారు. వడ్డివారిపాలెం, చోడాయపాలెం సచివాలయాల పరిధిలో పోటీలను సెక్రటరీలు, సిబ్బంది నిర్వహించి పర్యవేక్షించారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు ..

కర్లపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాలతో క్రీడా పోటీలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని డీపీఓ, ఎంపీడీఓ దాసరి రాంబాబు తెలిపారు. ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలలో మూడో రోజు గురువారం క్రికెట్ పోటీలు జరిగాయి. యాజలి ఉన్నత పాఠశాలలో డీపీఓ రాంబాబు బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభించగా, చింతాయపాలెంలో ఈవోపీఆర్డీ ఎ.ఎలీషాబాబు పోటీలను ప్రారంభించారు. మండలంలోని యాజలి, చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల క్రీడా ప్రాంగణంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో దమ్మనవారిపాలెం, యాజలి, దుండివారిపాలెం, నాగరాజుపాలెం, బుద్దాం, కర్లపాలెం, చింతాయపాలెం గ్రామాలకు చెందిన సుమారు 10 క్రికెట్ టీమ్‌లు పాల్గొన్నాయి. వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.మెర్సీ, ఎం.గోపి, సీహెచ్ శ్రీనివాసరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పద్మావతి, వీరాస్వామిరెడ్డి, సునీత, శ్రీనివాసరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.



వడ్డీవారిపాలెం గ్రామంలో బ్యాడ్మింటన్ ఆడుతున్న మహిళలు



పేటేరులో బాల్ బ్యాడ్మింటన్ పోటీలను తిలకిస్తున్న అధికారులు, స్థానికులు



యాజలిలో బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభించిన డీపీఓ రాంబాబు

అయోధ్య రాముని అక్షింతలకు ప్రత్యేక పూజలు

ఐలవరం(భట్టిప్రోలు): అయోధ్య రాముని అక్షింతలకు భట్టిప్రోలు మండలం ఐలవరంలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవు నెయ్యి, పసుపును బియ్యంతో సంయోగం చేసి స్పర్శ కార్యక్రమం జరిపారు. అనంతరం గ్రామంలోని అన్ని పురవీధులలో శ్రీ రామనామ స్మరణతో భజన సంకీర్తన చేస్తూ శోభాయాత్ర నిర్వహించారు. గ్రామంలోని అన్ని రామాలయాలకు అయోధ్య అక్షింతలు అందజేశారు. అర్చకుడు దీవి రఘునాథచక్రవర్తి మాట్లాడుతూ శ్రీరాముని జీవితం మానవులందరికీ ఆదర్శమన్నారు. కుటుంబ వ్యవస్థ బలపడి బాగుపడాలంటే రామాయణం తెలుసుకోవాలని పేర్కొన్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం భారతీయులందరికీ గర్వకారణమని తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు మురుగుడు శ్రీనివాసరావు, నిర్వాహకులు జంజనం హేమశంకరరావు, ఎస్.నాగేశ్వరరావు, ఎం.రంగారావు, ఎఫ్.నాగేశ్వరరావు, వి.కోటేశ్వరరావు, ఎ.వెంకటేశ్వరరావు, ఎ.పావన్ కుమార్, డి.సుజాత, జె.జ్యోతిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఐలవరంలో అయోధ్య రాముని అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



బాపట్లటౌన్: విద్యార్థి దశనుంచే చదువుతో పాటు యోగాసనాలపై దృష్టి సారించాలని సరస్వతి స్మారక బాలికల పాఠశాల హెచ్‌ఎం టి.రమాదేవి తెలిపారు. పట్టణంలోని రామకృష్ణ సేవ సమితి ఆధ్వర్యంలో ఈనెల 26 నిర్వహించిన యోగ పోటీల్లో సరస్వతి స్మారక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జూనియర్స్ విభాగంలో 7వ తరగతి చదువుతున్న చీమల దిన్నే మైథిలి ప్రథమ బహుమతి సాధించింది. ఎం.రాజేశ్వరి ద్వితీయ బహుమతిని సాధించింది. అదేవిధంగా సీనియర్స్ విభాగంలో 10వ తరగతి చదువుతున్న పులి ఋషివర్ధని ప్రథమ బహుమతి, కన్సొలేషన్ బహుమతి 9వ తరగతి చదువుతున్న చీమలదిన్నే హేమ లక్ష్మి సాధించింది. అనంతరం బహుమతులు సాధించిన విద్యార్థులను గురువారం పాఠశాలలో అభినందించి బహుమతులను అందజేశారు. రామకృష్ణ సేవాసమితి నిర్వాహకుడు సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని మహిళ బలవన్మరణం



రూాన్సీ మృతదేహం

పిట్టలవానిపాలెం: ఉరి వేసుకుని మహిళ బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. చందోలు పోలీసుల కథనం ప్రకారం ఖాజీపాలెం గ్రామంలో నివసిస్తున్న బొరుసు ఝాన్సీ (40)ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వెదుళ్ళపల్లి గ్రామానికి చెందిన నాగరాజు, ఝాన్సీలు గత కొంతకాలంగా ఖాజీపాలెం గ్రామంలో అద్దెకు ఉంటూ గోకర్ణమఠం గ్రామంలో గల రాయల్ మెరైన్ కంపెనీలో పనిచేస్తున్నారు. మృతికి సంబంధించిన కారణాలు తెలియరాలేదు. స్థానికుల సమాచారం మేరకు చందోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బీసీ నాయకుడు శేషంరాజుకు ఘననివాళి

తెనాలిటౌన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ నాయకుడు తంగెళ్ళ శేషంరాజు వర్ధంతి గురువారం రామలింగేశ్వరపేటలోని శ్రీ సత్యసాయి బాబా మందిరంలో జరిగింది. అక్కడ ఉన్న శేషంరాజు విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, గుర్రపు ద్వారక శ్రీనులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ శేషంరాజుతో తమకు ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. శేషంరాజు కుటుంబ సభ్యులు సుందరమ్మ, అనురాధ, సత్యనారాయణ రాజు, కొండం రాజు పాల్గొన్నారు.



శేషంరాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కేశన శంకరరావు, తదితరులు

పేదలకు దుప్పట్లు పంపిణీ



తెనాలిఅర్బన్: శ్యామ్ అండ్ జెన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెంచుపేటలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ అలెగ్జాండర్ మాట్లాడుతూ ఎయిడ్స్, టీబీ రోగులకు అవసరమైన మందులను కూడా ప్రతి నెల పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఎస్.రమేష్, సభ్యులు పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

తెనాలిటౌన్: పట్టణ రైల్వేస్టేషన్ వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భవానీ మాల ధరించిన వారికి గురువారం మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. గురువు దేశబోయిన పున్నారావు సత్యవతి దంపతుల ఆధ్వర్యంలో 250మంది భవానీలు, అయ్యప్ప మాలలు ధరించారని తెలిపారు. గత 20 సంవత్సరాల నుంచి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పట్టణ బీసీ సంక్షేమ నాయకులు ఆరాధ్యుల శివ యాదవ్, తాడిబోయిన శంకరరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

చెత్త సేకరణకు ప్రత్యేక ఏర్పాట్లు

మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ హెలెన్ నిర్మల

తెనాలిఅర్బన్: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో పట్టణంలోని చెత్తను తొలగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల గురువారం తెలిపారు. కార్మికులు మూడు రోజుల నుంచి సమ్మెలోకి వెళ్లిన నేపథ్యంలో ప్రత్యేక సిబ్బంది ద్వారా చెత్త సేకరణ చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశామన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆయా వార్డుల్లో పర్యటిస్తూ దీనిని నిత్యం పర్యవేక్షిస్తున్నారని చెప్పారు.

నేడు కౌన్సిల్ అత్యవసర సమావేశం

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు తెలిపారు. ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన వహిస్తారు. అలాగే 11.45 గంటలకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. 2023-24 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ అంచనాలు సమావేశంలో ఆమోదించనున్నట్లు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

తెనాలిరూరల్: పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. తెనాలి మండలం జగ్గడిగుంటపాలెం గ్యాస్ గోడౌన్ వెనుక కోతముక్క ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తమ సిబ్బందితో గురువారం రాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3200, నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనపర్చుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.



జూదరులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఈస్టిండియా కంపెనీ నాటి రాగి నాణేలు లభ్యం



కనగాల పృథ్వీశ్వర స్వామి దేవస్థానంలో తొలగించిన ధ్వజస్తంభం



ధ్వజస్తంభం అడుగు భాగాన లభించిన రాగి నాణేలు

పృథ్వీశ్వర స్వామి దేవస్థాన ధ్వజస్తంభం తొలగింపులో బయల్పడిన 83 నాణేలు

చెరుకుపల్లి: ఎంతో చరిత్ర కలిగిన శ్రీ పృథ్వీశ్వర స్వామి దేవస్థాన ధ్వజస్తంభం శిథిలావస్థకు చేరటంతో దానిని గ్రామస్తులు, అధికారులు గురువారం తొలగించారు. దేవస్థాన ఈఓ అనుపమ మాట్లాడుతూ మండలంలోని కనగాల గ్రామంలో వేంచేసి యున్న పృథ్వీశ్వర స్వామి దేవస్థానంలో సుమారు 150 సంవత్సరాల క్రితం ప్రతిష్ఠించిన ధ్వజస్తంభం అడుగు భాగం పూర్తిగా దెబ్బతినటంతో వేదపండితుల సమక్షంలో ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు వెలికి తీశారన్నారు. ధ్వజస్తంభం అడుగు భాగంలో ఈస్ట్ ఇండియా కంపెనీ కాలానికి చెందిన 83 రాగి నాణేలు లభించాయని అనుపమ తెలిపారు. ఈ నాణేలను రెవెన్యూ అధికారులు, పోలీస్ వారి సమక్షంలో భద్రపరిచామన్నారు. ఆలయ నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం 2024 ఫిబ్రవరి 14గా నిర్ణయించారని, దానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు చావలి జనతారావు, ఏఎస్ఐ శ్రీనివాసరావు, దేవస్థాన సిబ్బంది కుమార్ బాబు, పాలకమండలి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

పిట్టలవానిపాలెం: పిట్టలవానిపాలెం మండల ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో 2024 క్యాలెండర్‌లు, డైరీలను ఎంఈఓ ఉయ్యూరి వెంకటేశ్వరరావు గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు ఎల్.చక్రపాణి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి ఏపీటీఎఫ్ కృషి చేస్తుందని పేర్కొన్నారు. 2024 క్యాలెండర్, డైరీని ఆవిష్కరించడం జరిగిందని తెలిపారు. తొలుత ఎంఈఓ వెంకటేశ్వరరావుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఉపాధ్యాయులు పరిశ నరసింహారెడ్డి, మూకిరి ప్రకాశరావు, నాగాంజనేయులు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ వెంకటేశ్వరరావు

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ లలిత కుమారి, జెడ్పీటీసీ ఉదయభాస్కరి

వెల్లటూరు(భట్టిప్రోలు): చదువే ఉన్నతికి మూలమని ఎంపీపీ వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరిలు అన్నారు. భట్టిప్రోలు మండలం వెల్లటూరు జెడ్పీ హైస్కూల్‌లో గురువారం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం హైస్కూల్ హెచ్‌ఎం కర్రా అరుణకుమారి అధ్యక్షత జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీపీ, జెడ్పీటీసీలు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారని అన్నారు. చదువే ఆయుధమని గ్రహించిన సీఎం వైఎస్ జగన్ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని తు.చ. తప్పక పాటిస్తున్నారని అన్నారు. ఎంఈఓ దేవరాజు, ఎస్ఎంసీ చైర్మన్ సీహెచ్ సాంబశివరావు, ఎంపీ టీసీ సభ్యురాలు ధారావత్ కుమారీభాయి, ఉపాధ్యాయులు మురళీమోహన్, రెడ్డి సుధాకర్, హరిప్రసాద్, ఆషాలత, రామారావు, సుభాని పాల్గొన్నారు.